


ఇల్లంతా బోసిగా వుంది.

సాయంత్రం ఎనిమిది అయ్యింది. మిత్రుడు ఇంత దాకా మాట్లాడి వెళ్ళిపోయాడు. శ్రీమతి, పిల్లలు సినిమాకెళ్లారు. ఇంకా రెండు గంటలు కావాలి వాళ్లురావటానికి. అప్పటిదాకా యింట్లో ఏకాకిగా గడపటం బాధగానేవుంది

రేడియో ఆన్ చేశాను. ఏదోసంగీతం మళ్ళీ ఆఫ్ చేశాను

ఏదైనా పుస్తకం చదవాలని అలమారలో పుస్తకాలు వెదుకుతున్నాను.

టెలిఫోన్ మ్రోగుతూవుంది

రిసీవర్ అందుకొని "ఎవరూ?" అన్నాను.

"నేను సేట్ మదన్‌లాల్‌ను మాట్లాడుతున్నాను. ఇవ్వాళో కేసు జరిగింది వకీలు సాబ్. నాదగ్గర రిక్షా కిరాయకు తీసుకపోయే ఒకడు నాకు ఎదురు తిరిగాడు. రెండేళ్ళ నుండి వాడు నా వద్ద రిక్షా కిరాయకు తీసుకెళ్తున్నాడు. ప్రతి నిత్యం కిరాయ తెచ్చియిచ్చేవాడు. ఈ మధ్య పదిహేను రోజులనుండి వాడు కనిపించటంలేదు. కిరాయ కూడా తెచ్చి యివ్వటంలేదు. యివ్వాళ్ళ ఎక్కడో కనిపిస్తే మా జీతగాడు వాన్ని పట్టి తెచ్చాడు. వాడు రిక్షా ఎక్కడో పెట్టి వట్టి చేతులతో వచ్చాడు."

"వింటున్నారా వకీలు సాబ్ ఊఁ కొట్టటం లేదు?"

"ఊఁ" అన్నాను.

"కిరాయ యివ్వుమంటే లేదన్నాడు. రిక్షా తెచ్చివ్వుమంటే లేనన్నాడు. రెండు సంవత్సరాల కిరాయ కట్టాను. రిక్షా ఖరీదు కంటే డబ్బులిచ్చాను. ఇంకా రిక్షా యివ్వనన్నాడు. కిరాయ ఇవ్వనన్నాడు. నాకుకోపమొచ్చిలోపలేసి తన్నించాను."

"వకీలుసాబ్ పోలీసు స్టేషన్ లో రిపోర్టిస్తానని వెళ్లాడు వాడు బ్రతుకుతాడో చస్తాడో కాని రిపోర్టిస్తాడట వెధవ. నన్ను పట్టుకొని రిమాండ్‌లోవేస్తే విడిపించు సబ్‌ఇన్స్పెక్టర్‌కు నేను కొంత పారేస్తాను కాని...ఈ కేసు నీవు తీసుకోవాని రిక్షా రావాలి...వాడు కోర్టుకు తిరిగి తిరిగి చావాలి... వింటున్నారా వకీలు సాబ్."

"మీకే నంబరు కావాలండీ?" అడిగాను.

"264 వకీలు రామనాథం కావాలి."

"రాంగ్ నెంబర్. దిస్ ఈజ్ 364."